# నేను నేనే-7

**Index** **Page no**


| Index | Page no |
|---|---|
| 114. తపస్సు-ధ్యానం | 2 |
| 115. బోధ-అనుభవం ఏకకాలంలో జరిగే ప్రక్రియ | 3 |
| 116. ప్రశ్న గర్భంలోనే సమాధానం ఉంటుంది | 5 |
| 117. మృత్యుభీతి-శరణాగతి-పూర్ణార్పణం | 7 |
| 118. అన్నీ తానైన వాడు-తుదిలేని కన్ను | 9 |
| 119. మూలమంత్రం-ఉన్నది ఒక్కటే దానికి విడిగా ఏమీలేదు | 14 |
| 120. విచారణ – శరణాగతి | 19 |
| 121. ఆత్మవిచారణ-అంతిమ మార్గం | 23 |
| 122. ఋభుగీత | 27 |
| 123. "నేనే" సత్యం, ధర్మం, న్యాయం | 34 |
| 124. దేహం నాలోనిది | 40 |
| 125. ప్రియం – వైరం | 42 |
| 126. "నేనే" విశ్వకేంద్రం | 48 |
| 127. శీలమంటే పారదర్శకత | 54 |

114. తపస్సు-ధ్యానం

తపస్సు అనగా ఏమి?

* * *

అహంస్వరూపానికై తపించిపోవడం...

అహంకారాన్ని దహించివేయడం...

* * *

తపస్సు, ధ్యానం తేడా  చెప్పగలరు...

* * *

ఇప్పుడిప్పుడే అవసరం లేదన్నట్లుగా...

వాయిదా పద్ధతుల్లో చేసుకునే సాధన ధ్యానం...

అదొక టైంటేబుల్ సాధన...

* * *

మన ఋషులెవరూ ధ్యానం చేయలేదు...

తపస్సు చేశారు...

ధ్యానం బౌద్ధుల మాట...

తపస్సు మన సనాతనుల మాట...

* * *

అమ్మ దగ్గర తనకు కావలసిన దానిని సాధించే వరకు బాలుని ఆగని ఏడుపు తపస్సు...

* * *

బిడ్డ తప్పిపోతే...బిడ్డ దొరికే వరకు తల్లి పడే ఆవేదన తపస్సు...

* * *

సమాధానం పొందే వరకు యముడి గడపట్లో భీష్మించికూర్చున్న నచికేతునిది తపస్సు...

* * *

"అగ్రస్థానం" పొందేవరకు పట్టు వదలని ధ్రువునిది తపస్సు...

* * *

మరణభీతి కలిగినప్పుడు...

దానిని అప్పటికప్పుడే తేల్చుకున్న రమణుడిది తపస్సు...

* * *

"ఊపిరి" అంత అవసరంగా ఉన్న "లక్ష్యమే" తపస్సు...

* * *

"సాధన అంటేనే వాయిదా వేయడం"

అంటారు జిడ్డుకృష్ణమూర్తి...

అంటే ఇప్పటికిప్పుడే "పొందటం" నీకిష్టం లేక...

సాధన పేరుతో వాయిదా వేస్తున్నావు...

* * *

ఓ పాముపిల్ల రోడ్డు దాటుతూ...

నా కాళ్లమధ్యలోకి వచ్చేసింది...

దానిని తప్పించుకోవడానికి నేను చేసిన డాన్స్ గుర్తొస్తే...

ఇప్పటికీ నవ్వొస్తుంటుంది...

"పాము నుంచి తప్పించుకోవడం ఎలా?

అనే గ్రంథాన్ని పరిశీలించలేదు...

కనీసం పక్కనే ఉన్న స్నేహితుడిని కూడా సలహా అడగలేదు...

అప్పటికప్పుడే...

తనకు తానే...

తీసుకున్న నిర్ణయమే...

చేసిన ప్రయత్నమే...

తపస్సు.

* * *

ప్రయత్నంలో-

తీవ్రత ఉన్నప్పుడు దాని పేరు - తపస్సు.

తీవ్రత లేని ప్రయత్నం పేరు - ధ్యానం.

రెండూ ఒకటే...

తీవ్రతే తేడా...

* * * * * * * * * * * * * * * * * * * * * * *

### 115. బోధ-అనుభవం ఏకకాలంలో జరిగే ప్రక్రియ

వస్తువు ఎక్కడో పెట్టి మరచిపోయావు...

ఆ వస్తువు కోసం

ఎవరెవర్నో అడుగుతున్నావు...

ఎక్కడెక్కడో వెతుకుతున్నావు...

గురువొచ్చి గుర్తుచేస్తాడు ఆ "చోటు"ను.

ఓ...అంటూ గుర్తుకొచ్చిన ఆనందంలో
శిష్యుని మోములో చిరునవ్వు మెరుస్తుంది...
గురువు ఆ వస్తువును తెచ్చివ్వలేదు...
శిష్యుడు వెళ్లి ఆ వస్తువును గభాల్న వెళ్లి తెచ్చుకోనూలేదు...

అయినా శిష్యునిలో అంతకు ముందున్న ఆందోళన లేదు...
అన్వేషణ ఆగింది.
స్థిమితం కలిగింది.

గురుబోధ అనేది శబ్దమాత్రంతోనే...
అంటే గురువు ఒక్కసారి అలా చెప్పగానే...
జ్ఞప్తిలోకి(అనుభవంలోకి) వచ్చేస్తుంది.
బోధ-అనుభవం ఏకకాలంలో జరిగే ప్రక్రియ.
"విన్నంత మాత్రాన లాభం లేదు...
అనుభవంలోకి రావాలి...

అనుష్టానం చేయాలి..."అంటుంటారు కొందరు...
అవన్నీ అజ్ఞానపు ప్రేలాపనలు...
అలాంటి ప్రోగ్రాములు ఏమీ ఉండవు.
వినడం-పొందడం ఏకకాలంలో జరిగే ప్రక్రియ.
ఉపదేశానికి, అనుభవానికి వెంట్రుకవాసి ఎడం కూడా ఉండదు.
అసలు ఆ రెండూ ఒకే వస్తువు అని చెప్పాలి...
కాబట్టి ఉపదేశానికి, అనుభవానికి మధ్య
అనుష్ఠానానికి తావేలేదు...
"అనుష్ఠానవేదాంతం" అన్న మాటే తప్పు.
అనుష్ఠానం వలన అనభవం కలుగదు.

గురువు,శిష్యుడు అంటే-
ఒకే శ్రుతిలో చేయబడిన రెండు తీగలు...

ఒకే చక్కెరతో చేయబడిన రెండు మిఠాయిలు...

ఇంకా చెప్పాలంటే-

శిష్యుని యొక్క ప్రకటన రూపం గురువు.

గురువు యొక్క అప్రకటన రూపం శిష్యుడు.

తన అనుభవాన్నే గురు వాక్కు రూపంగా వింటాడు శిష్యుడు.

శిష్యునితో మాట్లాడుతున్నప్పటికీ...

తనతో తాను, తనలో తాను

మాట్లాడుతున్నట్లు అనుభూతి చెందుతాడు గురువు.

* * * * * * * * * * * * * * * * * * * * *

**116. ప్రశ్న గర్భంలోనే సమాధానం ఉంటుంది**

నాకు కొన్ని ప్రశ్నలున్నాయి...

* * *

నీకు ప్రశ్న ఉండడం కాదు...

నీవే ప్రశ్న.

నీకు సమాధానం దొరకడం కాదు...

నీవే సమాధానం...

* * *

ప్రశ్న గర్భంలోనే సమాధానం ఉంటుంది...

పండు గర్భంలో బీజం ఉన్నట్టు...

ప్రశ్ననే ధ్యానించాలి...

అదే సమాధానంగా మారుకుంటుంది...

కాయే పండుగా మారుకున్నట్లుగా...

* * *

భగవంతుడు మనల్ని పుట్టించాడు...

మనకు free will అంటూ లేదా...

* * *

Free will కూడా భగవదిచ్ఛలో అంతర్భాగమే...

భగవంతుడు నీకిచ్చిన పరిమిత శక్తికే...

free will అని పేరు...

ఆ పరిమితశక్తికి లోబడి నీవు ఏమేమి చేయగలవో....అదంతా చేసుకో....

నీ  శక్తికి మించి ఉండేదానిని ఎలాగూ నీవేమీ చేయలేవు...

మైదానంలో పలుపుతాడు చేత కట్టివేయబడిన పశువు...

ఆ తాడు పొడవును బట్టి ఎంత దూరం పోగలదో...

అంత మేరకే తిరుగుతూ గడ్డి మేస్తున్నట్లుగా...

* * *

ఆనందంగా ఉండాలన్నా...

ఉండలేకపోతున్నాను...

తప్పు చేయకూడదనుకున్నా...

తప్పు చేస్తున్నాను...

ఏదో శక్తి బలవంతంగా నడిపిస్తోందని అనిపిస్తోంది...

* * *

అవును...

అదే విధి...అదే దైవం...

మన చేత మంచి చేయించేదీ అదే...

చెడు చేయించేదీ అదే...

* * *

మనిషికి స్వేచ్ఛ అనేది లేకపోతే ఎలా?

* * *

కొంత మేర స్వేచ్ఛ ఉండనే ఉంది కదా...

ఆ స్వేచ్ఛ మేర ఏం చేయగలవో అది చేయి...

ఎవరు వద్దన్నారు...

శారీరకమానసిక పరిమితుల్లో ఉండే దైవశక్తినే...

పురుషకారం(free will) అంటున్నాం...

తనువు, మనసును దాటి ఉన్న దైవశక్తినే...

విధి  అని భగవదిచ్ఛ అని అంటున్నాం...

* * *

మన లోపలి సంస్కారాలకు కర్త ఎవరు?

* * *

కర్త ఒకడే, కర్త  భగవంతుడే...

లోపల ఒక కర్త....బయట ఒక కర్త ఉండడు...

* * *

ఎలాంటి థింక్సూ లేకుండా...

హాయిగా ఉండాలంటే ఏం చేయాలి?

* * *

ఎలాంటి థింక్సూ లేకుండా ఉండడం అసాధ్యం...

అది ఒక్క శవానికే సాధ్యం...

అన్నీ face చేయాల్సిందే....

అన్నీ taste చేయాల్సిందే...

అన్నిటికీ  సిద్ధపడి ఉండడమే జ్ఞానలక్షణం...

**********************

**117. మృత్యుభీతి-శరణాగతి-పూర్ణార్పణం**

మృత్యుప్రవాహంలో తేలియాడుతూ

కదులుతున్న కాగితం పడవ తాను.

నానటం జీవితం.

మునగటం మరణం.

ఈ కట్టె కట్టెల్లో కాలకమునుపే

ఈ మట్టిపెళ్ల లాంటి దేహం మట్టిలో కలవక మునుపే

మృత్యురహస్యాన్ని కనుగొనటం

జీవితపరమార్థం.

మనకున్న అన్ని భయాలకు తల్లి లాంటిది మరణభయం.

మరణభయమే మిగతా వివిధరకాల భయాలుగా మనకు అనుభవంలోకి వస్తాయి.

మరణభయమే లేదంటే, ఇక ఏ భయమూ ఉండదు.

"నాకు మరణభయం లేదుగానీ, నాకు బొద్దింక అంటే భయం"అని అంటుంటారు...ఇది నమ్మదగినది కాదు.

ఏ రకమైన భయం ఉన్నా సరే వారికి మరణభయం ఉన్నట్టే.

* * *

పుట్టుక అనేది మన ప్రమేయం లేకుండా జరిగిన ఓ హఠాత్ ఘటన.

జీవితమూ, అందులోని ప్రతి సన్నివేశమూ హఠాత్తుగా సంభవించేవే; నీవు ప్లాన్ వేసుకుని చేసే కర్మలైనా సరే.

చివరకు మరణమూ అంతే.

అదీ ఓ నివారించలేని ఓ హఠాత్ ఘటనే.

మరి మనం ఇంచుకైనా నివారించలేని

ఈ హఠాత్ సంఘటనల సమ్మేళనమైన జీవితం విషయంలోగానీ,

చిట్టచివరి ఘటన ఐన మరణం విషయంలోగానీ

తానెందుకు ఆందోళన పడడం?

ఆందోళనకు మూలకారణం ఒక్కటే...

నేను-నాది అనే భావన.

నిజానికి ఈ నేను-నాది అనేవి ఎవడి సొత్తో

వాడికి(ఈశ్వరుడికి)స్వచ్ఛందంగా అప్పజెప్పడమే శరణాగతి.

* * *

నేను-నాది భావనను వదలనంతవరకు మృత్యుభయం తప్పదు.

దృతరాష్ట్రుడు అటువంటి భావనను వదలకనే

మృత్యుభీతితో ఇలా ప్రశ్నించాడు సనత్సుజాతులవారిని.

దృతరాష్ట్రుడు: మీరు చిరంజీవులు....సృష్ట్యాది నుండి మీరు ఇలానే ఉన్నారు...

మా పూర్వీకులందరూ మరణించారు....త్వరలో నేనూ మరణిస్తాను...

మీ విషయంలో చూస్తే -

మరణం అర్థరహితం.

మా విషయంలో చూస్తే -
మరణం అనివార్యం.

ఇంతకీ మరణం అనేది ఏమి?
మరణం అనేది ఉందా?లేదా?

సనత్సుజాతులు: నీవు శాశ్వతమైన వస్తువును (ఆకాశాన్ని, సచ్చిదానంద స్వరూపాన్ని) ధ్యానిస్తే నీవు శాశ్వతుడవు.

నీవు అశాశ్వతమైన వస్తువును ధ్యానిస్తే
నీవు అశాశ్వతుడవు.

* * *

పరిమితాలైన, అశాశ్వతవస్తువులైన నేను-నాది లను వదిలి
శాశ్వతమైన ఈశ్వరుని చరణాలకు శరణుపొందు...

ఆ పూర్ణార్పణం వలన నీవే ఈశ్వరుడవుతావు.
మృత్యుదేవతకు నీవే అధిపతి అవుతావు.
మరణభయం లేని కాలకాలుడవుతావు.

*******************

**118. అన్నీ తానైన వాడు-తుదిలేని కన్ను**

దేవాలయస్తంభాల మీద శిల్పాలు చూస్తాం...

ఈ అందమైన శిల్పాన్ని చెక్కినవాడెవడో! అని కాసింత ఆశ్చర్యపోతాము.

ఆ "ఎవడో" యొక్క నామ-రూపాలు తెలియదుగాని,
ఎవడో ఒకడు ఉండి ఉండాలి అనేది ఖాయం.

అలాగే ఈ జగత్తును చూస్తున్నాం కాబట్టి
బహువిధశక్తులు కలిగిన కారణకర్త ఒకడున్నాడు అనేది అందరూ అంగీకరిస్తారు.

వాడికి నామ-రూపాలు లేవు.
ఆ "ఎవడో" అనేవాణ్ణి మనం గుర్తుగా కొలుచుకోవడానికి మనలాంటి రూపాలనే చెక్కి దేవాలయాల్లో ప్రతిష్టించుకుని ఆరాధించుకుంటున్నాం.

నిజానికి ఆ "ఎవడో" అనేవాణ్ణి
కేవలం సృష్టికర్తగా మాత్రమే కాకుండా,
సృష్టికూడా వాడే అని గ్రహించడమే ఆధ్యాత్మిక లక్ష్యం.

1.ప్రేక్షకుడు
2.ఫిల్ము
3.తెర
4.కాంతి
ఈ నాలుగింటిలో ఏ ఒక్కటి లేకపోయినా
సినిమా లేదు.

అలాగే -
1.తెలుసుకునేవాడు(జీవుడు)
2.జీవునిలో అవ్యక్తరూపంగా ఉన్న లోకం
3.తనలో అవ్యక్తంగా ఉన్న లోకం వ్యక్తమవడానికి ఆధారంగా ఉన్న మహదాకాశం
4.జ్ఞానం.

ఈ నాలుగూ కలిపి ఈశ్వరుడు.
ఏ ఒక్కటి మాత్రమే ఈశ్వరుడు అనడానికి లేదు.
* * *
ఈశ్వరుడే ఉపాదానకారణము, నిమిత్తకారణము.
మట్టి, కుమ్మరి, కుండ మూడూ ఈశ్వరుడే.
కర్త, కర్మ, క్రియ మూడూ ఈశ్వరుడే.

అని ఉన్నప్పుడు ఇక ఏ అయోమయానికీ తావుండదు.

ఏ ఆటుపోట్లూ లేక జీవితప్రయాణం సాఫీగా హాయిగా సాగుతుంది.

* * *

మూలశక్తి ఒక్కటే.

అదే మూడయ్యింది-

1.వ్యక్తి, 2.జగత్తు, 3.దేవుడు గా

మూడు అయినాగాని "ఒకటి" సదా ఒకటిగానే ఉంది.

నగలుగా బహువచనంగా ఉన్నప్పటికీ

బంగారంగా సదా ఏకవచనంగా ఉన్నట్టు.

బంగార్లు అని ఎవడూ అనడు కదా!

బంగారు సదా ఏకవచనం.

అలాగే ప్రపంచం - బహువచనం.

పరబ్రహ్మం - ఏకవచనం.

నగలు వైపు దృష్టిమాని

బంగారం వైపు దృష్టి పెడితే

ఏకమే ఉంటుంది.

"అహంకారం" వలన సదా అనేకం వైపుకే దృష్టి మరలుతుంటుంది.

నీ దృష్టిని సదా స్వరూపనిష్ఠలో ఉంచగలిగితే

దానివలన అహం"కారం" చస్తుంది.

అహంస్వరూపం శేషిస్తుంది

* * *

నిరాకారుడైన భగవంతుణ్ణి కొలవడం ఎలాగో తెలియక

తన రూపంలాగే రూపొందించి తలుస్తున్నాడు, కొలుస్తున్నాడు మానవుడు.

తప్పదు మొదట్లో.

సాకారోపాసన ద్వారా నామరూప రహితమైన స్థితికి తాను ఎదగాలి.

ఆ నిరాకారస్థితిలో
భగవంతుణ్ణి ఎలా చూడగలడు?
"తాను"గానే ఉండగలడు(అనుభవించగలడు) అంతే.

సాకారుడు అంటే ఒక రూపానికే పరిమితమైనవాడు.

నిరాకారుడు అంటే సకలాన్ని తన రూపంగా ఉన్నవాడు.

అనంతమైన ఆకారమే నిరాకారం.
పరిమితమైన అనంతమే సాకారం.

తాను సాకారుడైనప్పుడు పరిమితదృష్టి ఉంటుంది.
కాబట్టి స్వరూపాన్ని చూడలేడు.

తాను నిరాకారుడైనప్పుడు
అనగా "చూచేవాడు-చూడబడేది-చూపు" మూడూ కలిపి "కన్ను"గా ఉన్న ఆ తుదిలేని కన్నుతో
ఏంచూడగలడు?
చూడలేడు.

వెరసి సాకారుడు, నిరాకారుడు
ఇద్దరూ స్వస్వరూపాన్ని కానలేరు...
* * *
అంధుడికి, దేవుడికి దృశ్యం కనబడదు.

దృశ్యముండి కన్నులేక కనలేనివాడు అంధుడు.

దృశ్యం కూడా కన్నులో భాగమై ఉన్నందు వలన

ఆ "తుదిలేని కన్ను"తో కనలేనివాడు దేవుడు.

* * *

నిన్ను విడిచి ఎక్కడా ఏమీలేదు.

నిన్ను విడిచి ఎక్కడికీ వెళ్లొద్దు.

నిజానికి నిన్ను నీవు విడవలేవు.

కానీ నిన్ను నీవు విడిచినట్టు భ్రమపడతావు అంతే.

నిన్ను నీవు విడిస్తే - బంధం.

నిన్ను నీవు విడవకుంటే - మోక్షం.

దేవుని కోసం గురువు కోసం

ఒక్క అడుగు కూడా వేయవద్దు.

నీవున్న చోటు పేరే - దేవుడు.

నీవున్న చోటు పేరే - గురువు.

* * *

తోటి బాటసారిగా తనతో నటిస్తూ వస్తున్న

ఓ దొంగ తలగడ క్రిందనే

ఒకడు తన ధనం మూటను దాచాడట.

ఆ దొంగ అంతటా వెతికాడేగాని

తన తలగడ క్రింద వెతకాలనే ఆలోచనే కలగలేదు.

తన హృదయంలోనే నేను-నేను అంటూ

అహంస్వరూపంగా ఉంది ఆ పరధనం.

సత్యాన్వేషి తన్నొదిలి అంతటా వెతుకుతున్నాడే గాని

తనలో వెతకాలనే ఆలోచనే కలగడం లేదు.

తనలో తాను వెతికితే...అన్వేషణ సమాప్తం.

* * * * * * * * * * * * * * * * * *

**119. మూలమంత్రం-ఉన్నది ఒక్కటే దానికి విడిగా ఏమీలేదు**

మనం చూచే దృశ్యం - లోకము.

మనం తెలుసుకునే తెలివి - జ్ఞానము.

లోకము - కార్యము.

జ్ఞానము - కారణము.

సూర్యకాంతి లేకుంటే దృశ్యం కనబడదు.

జ్ఞానకాంతి లేకుంటే దృశ్యమే ఏర్పడదు.

జ్ఞానము(మనసు)

లోకము (దృశ్యప్రపంచము)

ఈ రెండూ పుట్టి, ఉండి, లేకుండా పోవడానికి ఆధారంగా చావుపుట్టుకలు లేని సద్వస్తువు ఒకటి ఉన్నది.

అదియే పరిపూర్ణవస్తువు.

ఆ జ్ఞానము వలననే ఈ జ్ఞానము ప్రకాశిస్తుంది,

సూర్యకాంతితో చంద్రుడు ప్రకాశిస్తున్నట్టు.

ఈ లోకమునకు(భౌతికవస్తువుకు) కూర్పు-మార్పు ఉంటాయి.

ఆ పరిపూర్ణవస్తువు ఎట్టి మార్పుకూ గురికాకుండా ఉంటుంది.

లోకములో జ్ఞానాజ్ఞానములు రెండూ ఉంటాయి.

పారమార్థికంలో కేవలజ్ఞానము తప్ప అజ్ఞానము ఉండదు.

* * *

"ఉన్నది ఒక్కటే. దానికి విడిగా ఏమీలేదు"

మన తత్త్వజ్ఞానమునంతటికీ ఈ చిన్ని వాక్యము మూలమంత్రంగా ఉండాలి.

ఆ సద్వస్తువుకు విడిగా ఏమీలేదు....విడిగా ఉన్నట్లు కనిపించినా సరే.

ఆ ఏకాత్మవస్తువుకు మనం ఏ పేరు పెట్టుకున్నా సరే
అది అదిగానే ఉంటుంది.

సదా అది అదిగానే ఉండే వస్తువుకు-
సద్వస్తువు అని ఒక పేరు.
దానినే కొందరు ఆత్మ అన్నారు...
కొందరు పరబ్రహ్మము అన్నారు...
కొందరు "అది" (తత్) అన్నారు....

కొందరు రాముడు అన్నారు...
కొందరు బుద్ధుడు అన్నారు...

కొందరు కృష్ణుడు అన్నారు...
కొందరు క్రీస్తు అన్నారు...

ఏ పేరుతో వ్యవహరించినా
ఏ రూపుతో ఆరాధించినా
అది ఆ నిరాకారపరబ్రహ్మ  దర్శనానికే దారితీస్తుంది.

సాకారోపాసన యెప్పుడూ సాకారం వద్దనే ఆగిపోదు...
అది నిరాకారానికే దారి తీస్తుంది.

తద్వారా ఆ నిరాకారతత్త్వమే తానని తెలుస్తుంది.
తత్ఫలితంగా పరమశాంతి పొంది తన్మయమవడమే సత్యదర్శనము.

తన్మయమవడం అంటే-
తాను(సాకారుడైన తాను)
తనలో(నిరాకారుడైన తనలో)
విలీనమవడమే....

పరమహంస చెప్పినట్లు...

ఉప్పుబొమ్మ సముద్రపు లోతును కనుగొన ప్రయత్నించడమే.

ఈ దేహం అలా నశిస్తుంది అని అర్థంలో తీసుకోకండి...

ఉండీ లేనట్లవుతుంది...ఓ నీడలా...అంతే.

* * *

నేను అనే అహంకార పిశాచానికి(జీవునికి) అసలు రూపమే లేదు.

అది నిలవడానికి, వ్యవహరించడానికి ఏదో ఒక ఆలంబన(శరీరం) ఉండడం అవసరం.

అందుకు ఏదో ఒక శరీరాన్ని ఆవహించి(భావించి)

తన ఉనికిని నిలబెట్టుకుంటుంది.

జగత్తులో కనబడే ఈ జీవుల శరీరాలన్నీ

ఈ అహంకార పిశాచానికి ఆటవస్తువులే.

జడశరీరాల్ని నానా రకాలుగా ఆడిస్తుండేది

ఈ పిశాచమే.

ఒక రూపాన్ని వదిలి, మరో రూపాన్ని పట్టుకుంటూ...

దానిని కూడా వదిలి మరో రూపాన్ని పట్టుకుంటూ...(అనగా అభిమానిస్తూ) అర్థం పర్థం లేని

అనంతప్రయాణాలు చేస్తుంటుంది.

ఇదే జన్మపరంపర అంటే.

ఇంతకీ దీని ఉనికికి మూలమేది? అని అంతరాంతరాలలోకి విచారిస్తూ అహంమూలాన్ని చేరుకుంటే

అహంస్వరూపమే తానై పోతుంది ఈ పిశాచం. అదే విచిత్రం.

దెయ్యమే దైవంగా మారుకుంటుందన్నమాట.

'నేనెవరో తెలుసుకోక మునుపు నిన్ను వెతుకుతూ పలుచోట్ల తిరిగాను. ఇప్పుడు నేనెవరో తెలుసుకున్నాను. నేనే నీవు. నన్నావరించి నీవు అంతర్యామిగా మిగిలావు. ఆ రీతిగానే నేను నీ దివ్యదేహంలో ఒక భాగాన్ని. నీవు శరీరివి.' అంటారు భగవాన్.

భగవంతుణ్ణి విడిచి తనకసలు ఉనికే లేదని గ్రహించడమే ముక్తి.

* * *

ఒక పరిమిత వస్తువులో(తనువులో) ఇరుక్కున్నప్పుడు
జీవుడు అనే పేరుతోను,

జ్ఞానవిచారం వలన తనువుకు వెలుపల కూడా నేనున్నాను అనే అనుభవం కలిగినప్పుడు దేవుడు అనే పేరుతోను ఉండేది "ఒక్కటే".

రాజాస్థానంలో బంటుగా ఉంటాడు.
తన ఇంట్లో తాను యజమానిగా ఉంటాడు.

అలా దేవుడు ప్రపంచంగా ఉన్నప్పుడు జీవుడుగా ఉంటాడు.

ప్రపంచానికి ఆధారంగా ఉన్న ఉనికిగా తానున్నప్పుడు దేవుడుగా ఉంటాడు.

* * *

అహంకారం ఉంది అని ఒప్పుకుంటే
ప్రపంచమూ ఉంటుంది.
అది లేదంటే ప్రపంచమూ ఉండదు.

అహం అణగిన నిద్రలో ప్రపంచం లేదు.
అహం లేస్తే ప్రపంచమూ లేస్తుంది.
దానినే మెలకువ అంటున్నాం.

కాబట్టి అహమే(మనసే) అఖిలము(ప్రపంచము).

* * *

అహము లేక ప్రపంచం ఉండదు.
కానీ ప్రపంచం లేకుండా అహం ఉండగలదు.

ఆత్మ లేక అహం ఉండదు.

కానీ అహం లేకుండా ఆత్మ ఉండగలదు.

సముద్రం లేక కెరటం ఉండదు.

కానీ కెరటం లేకుండా సముద్రం ఉండగలదు.

* * *

సముద్రం - ఆత్మ.

కెరటం - అహం.

జల్లు - ప్రపంచం.

మూడూ నీరే...మూడూ ఆత్మే....

* * *

వైరాగ్య భావంతో-

ప్రపంచ సంగమం వదిలితే అహమును వదిలినట్టే.

విచారణ మార్గంతో-

అహమును వదిలితే ప్రపంచాన్ని వదిలినట్టే.

వైరాగ్యము, జ్ఞానవిచారము రెండూ ఒకటే అని

రమణభగవానులు చెప్పి ఉన్నారు.

బయట నుంచి నరుక్కుంటూ వెళతావో

లోపలినుంచి నరుక్కుంటూ వస్తావో

నీ ఇష్టం....

అటు నుంచైనా సరే

ఇటు నుంచైనా సరే

ఏకాత్మస్వరూపమైన "నేను" లో

సంస్థితమవ్వాలి అన్నదే సారాంశం.

ఏ మార్గమైనా ఒకటే...

"ఒకటే" మిగలాలి...

ఆ ఒకటే "నేను".

ఆ ఒకటే పరమపదం.

ఆ ఒకటే పరమసుఖం.

* * * * * * * * * * * * * * * * *

**120. విచారణ - శరణాగతి**

మనిషికి యెన్నటికీ వదలని అయోమయం ఒకటి ఉన్నది.

మనిషి జీవితాన్ని శాసించి నడిపేది-

1.విధియా?(అతీతశక్తియా?)

లేక

2.మతియా?(పురుషప్రయత్నమా?)

అనేది.

* * *

విధి-మతి రెండూ "రెండు పొట్టేళ్ల పోరాటం లాంటిది" అన్నది యోగవాశిష్ఠము.

బలమైనది గెలుస్తుంది...

బలహీనమైనది పడిపోతుంది...

విధికి తలవంచితే జీవితంలో ఓటమి తప్పదు.

విధి అనేది గతంలో తాను చేసిన పురుషప్రయత్నం యొక్క ఫలితమే.

కాబట్టి విధిని జయించడానికి పురుషప్రయత్నం తప్పనిసరి అని వాదించేవాళ్లు కర్మయోగులు అయినారు.

* * *

ఆ విధిని భగవంతుని శక్తిగా గ్రహించి,
పురుషప్రయత్నం కూడా ఆ విధి ఆడించే నాటకంలో భాగమేనని, జరిగేది  జరుగుతుంది, జరగనిది జరగదు అని, ఈ జగన్నాటకానికి కర్త ఈశ్వరుడని,  వానికి శరణుజొచ్చి,
మౌనంగా(కర్తృత్వభావన లేకుండా) ఉంటూ
అన్నిటికీ సిద్ధపడి ఉండే వాళ్లు జ్ఞానయోగులు అయినారు.

* * *

పరిపూర్ణంగా పురుషప్రయత్నం(ఆత్మవిచారణ) చేసినా, పరిపూర్ణంగా దైవానికి శరణాగతి చెందినా ఫలితం ఒక్కటే...."ఉండేది ఒక్కటే" అని తెలియడం.

* * *

ఘర్షణ యెప్పుడు వస్తోందంటే, కొన్నిటికి పురుషప్రయత్నం అని, కొన్నిటికి దైవసంకల్పం అని అనటం మూలాన.

'జరిగితే నా మాయ, జరక్కపోతే దేవుని మాయ' అన్నరీతిన ఉండడం వలన.
రెండు పడవలలో కాళ్లు పెట్టి ప్రయాణం చేయడం వలన.

* * *

పరిపూర్ణమైన పురుషప్రయత్నంతో బుద్ధుడు నిర్వాణపదం చేరాడు.

"అప్పా! నీ ఆజ్ఞ మేరకు వచ్చాను...." అని అరుణాచలేశ్వరునికి  పరిపూర్ణంగా శరణాగతి చెంది రమణుడు పరమపదం చేరాడు.

* * *

విధిమతుల మూలవివేకం లేనివారే వాదించుకుంటూ ఉంటారు...

రెంటికీ ఏకమూలమైన ఆత్మను చేరుకున్నవారికి అవి తొలగిపోతాయి. తరువాత ఏ వాదమూ ఉండదు.

* * *

బట్టను గమనిస్తారేగాని, మూలపదార్థమైన ప్రత్తిని గమనించరు.

సినిమాలో లీనమౌతారేగాని, బొమ్మల వెనుక తెరను గమనించరు.

పుస్తకంలో ఉన్న అక్షరాలపై ధ్యాసేగాని, అక్షరాలకు ఆధారంగా ఉన్న తెల్లకాగితాన్ని గమనించరు.

రూపాలను, వస్తువులను చూస్తాడేగాని
దాని వెనుక ఉన్న చైతన్యాన్ని గమనించరు.

* * *

తాను వ్యక్తిగా ఉన్నంతవరకు, తాను వ్యష్టిభావంలో ఉన్నంతవరకు ఈ విధి-మతుల వివాదం ఉండనే ఉంటుంది.

వ్యక్తిత్వనష్టి రెండువిధాలుగా జరుగుతుంది-

1. నేను యొక్క మూలానికెళ్లడం.
2.దైవానికి శరణాగతి చెందడం

ఈ రెండింటిలో ఏదో ఒక మార్గంలోకెళ్లి భగవంతుణ్ణి దర్శించాలి.

భగవంతుణ్ణి దర్శించిన తర్వాత వ్యక్తిత్వం నిలుపుకోవడం అసాధ్యం.

ద్రష్టా, దృశ్యమూ ఏకమై, 'సత్' అవుతారు.

గ్రహించేవాడు, గ్రహింపు, గ్రహించబడేది ఇవేవీ విడివిడిగా ఉండవు.

అన్నీ ఏకమై పరమేశ్వరుడే అవుతారు.

* * *

తాను సకలాన్ని చూస్తున్నాడు.
కానీ చూసే తనను చూడలేకున్నాడు.
తనను చూడడమే దైవాన్ని చూడడం.

అంతేగాని తనకు వెలిగా ఏదో రూపంలో కనబడేది కాదు దైవదర్శనం అంటే.

తనకు వెలిగా కనబడే ఎంత గొప్ప దృశ్యమైనా, దేవుడైనా అదంతా నీ మానసిక దర్శనమే.

అంటే స్వప్నంలో తోచే రూపాల్లాంటివే.

స్వప్నప్రపంచం నీ మనో వైచిత్ర్యమే కదా!

అలాంటిదే ఈ మెలకువలో కనబడే యావత్తు దృశ్యం కూడా.

చూచేవానికన్నా 'దైవం' మరొకరు లేరు.
చూడబడేదానికన్నా 'మాయ' మరొకటి లేదు.
అంటారు గురుదేవులు.

ఈ ఒక్కమాట గుర్తులో ఉంచుకుంటే....
నిన్ను ఏ దృశ్యమూ ఇబ్బంది పెట్టదు.
(నీ తనువు కూడా దృశ్యంలో భాగమే)
ఈ తనువు నీవు కాదు, ఈ తనువు అనేది దృశ్యంలో నీకు అతి దగ్గరగా ఉన్న ఓ భాగం మాత్రమే.

రైలులో తనతో చాలా మంది ప్రయాణిస్తుంటారు.
కానీ తన ప్రక్కనే కూర్చొని ఉన్న తోటి ప్రయాణికునితోనే పరిచయం పెంచుకుంటాం. అతని స్టేషన్ రాగానే దిగివెళ్లిపోయేటప్పుడు బాధపడతాం.

అలాంటి పరిచయమే తనకు తన తనువుతో ఉండేది.
ఉన్నంతకాలం ఉండి, దాని సమయం రాగానే అది తనను విడిచిపెట్టేస్తుంది.

కానీ 'తాను' సదా ఉంటాడు.

ఆ సదా ఉన్న 'ద్రష్ట' యే 'నేను'(దైవం).

దైవం లేక తానూ(వ్యక్తి) లేడు, జగత్తూ లేదు.

ఆ ద్రష్టలో నుంచి ప్రసరించే దృశ్యమంతా(ప్రపంచమంతా) మాయ.

కాబట్టి అహమిక మూలానికెళ్లి హృదయపీఠంపై నిలిస్తే   ఆత్మసామ్రాజ్యాన్ని ఏలే చక్రవర్తివి నీవే అవుతావు.

* * * * * * * * * * * * * * * * * * * * * *

**121. ఆత్మవిచారణ-అంతిమ మార్గం**

నేను అని మనం నిత్యవ్యవహారంలో వాడే మాట
ఈ శరీరాన్ని దృష్టిలో ఉంచుకుని అనే మాటే.

నేను అంటే 'శ్రీధర్' అనే దానికి అర్థం.
ఇది సాకార అహంకారం.

నీ లోపలికి నీవు మునిగితే
అక్కడ శరీరస్పృహ ఉండదు.
కానీ 'నేను' అన్న స్ఫురణ ఉంటుంది.
ఇది నిరాకార అహంకారం.

ఈ నేను యొక్క మూలాన్ని వెతుక్కుంటూ...
అలానే వెనక్కు వెళితే,

మెలకువ రాగానే కల చెదరిపోయినట్టు
ఈ నేను కూడా లేకుండాపోయి "అసలు నేను"
సాక్షాత్కరిస్తుంది.

ఇది "అహం స్వరూపం"

ఇదే లోకానికి శ్రీరమణులు అనుగ్రహించిన
"జ్ఞానవిచారమార్గము".

మిగతా లోకంలో ఉన్న మార్గాలన్నీ సహాయకారులేగాని
అవి అంతిమం కాదు.

ఆత్మవిచారణ ఒక్కటే అంతిమ మార్గం.

ఎవరు ఏ మార్గాలలో ప్రయాణించినా
చివరికి "నేను" వద్దకు చేరవలసిందే.
"ఆత్మ"లో స్థిరపడవలసిందే.

* * *

"అసలు నేను" సాక్షాత్కారం జరిగాక కూడా
"వ్యక్తిగతమైన నేను" ఉంటుందిగాని

అది సూర్యోదయం అయ్యాక ఉన్న చంద్రుని వలె ఉంటుంది. అనగా ఉండీ లేనట్లుంటుంది.

అసలు నేనును(ఆత్మను) సాక్షాత్కరించుకున్న మహనీయుని శరీరం కూడా పవిత్రవస్తువే, పూజనీయమే.

* * *
ఆత్మసిద్ధికై సాధన అవసరమా? కాదా?
అని గురువుగారిని అడిగితే,

ఆ ప్రశ్నలోనే సాధన అవసరం అనే సూచన ఉంది.
ఆత్మజ్ఞుడికి ఏ ప్రశ్నా ఉండదు.

ఏ సాధన చేయమంటారు? అని అడిగితే,

"నేను ఈ తనువుకు బయట కూడా నిండి ఉన్నాను" అని భావిస్తూ ఉండు.

కొంతకాలానికి ఆ భావ తీవ్రత వలన
"పూర్ణానుభవం" కలుగుతుంది అంటారు.

"అనుకుంటే సరిపోతుందా?" అని ఆశ్చర్యంగా అడిగితే,

"అవును. అనుకుంటే చాలు....
ఇప్పుడు 'నేను శ్రీధర్' అనే పరిచ్ఛిన్న భావం కూడా
నీవు అనుకోవడం వలన ఉన్నదే తప్ప నీవు శ్రీధర్ కాదు."

IAM THAT IAM నేను అదే నేను - నేను అదే నేను అని పదే పదే అనుకోవడం వలన నిజంగానే నీవదే ఐపోతావు.
అందుకే మన ఋషులు "అహం బ్రహ్మాస్మి" అనుకోమన్నారు.

* * *

సాధన చేయమురా నరుడా....
సాధ్యము కానిది లేదురా....
అన్నాడు దాశరథి.

అవును.... సాధన చేయవలసిందే.....

సాధన లేక సిద్ధి కలుగదు అని
రమణగీతలో రమణభగవానులు నొక్కి వక్కాణించి వున్నారు.
అవును....సాధన చేసి తీరవలసిందే.....

* * *

లౌకికవిషయంలో-

ధర్మాచరణయే గొప్ప సాధన.

ఆధ్యాత్మిక విషయంలో-
ఆత్మవిచారణే గొప్ప సాధన.

రెండిటి పరమగమ్యం స్వరూప దర్శనమే.

ధర్మాచరణ వలన మనఃశుద్ధి.
మనఃశుద్ధి వలన ఆత్మవిచారణ
సహాయకారులు.

నిజానికి ఆత్మవస్తువు మనలోని వస్తువే
మనమే అయి ఉన్న వస్తువే.

కాకపోతే విపరీతమైన బాహ్యావ్యవహారం వలన
అంతరమున ఉన్న ఆత్మ వస్తువు మరపుకు వచ్చి
ఉండి లేనట్లయ్యింది.

అంతేగాని సాధన అంటే లేని వస్తువును పొందటం కాదు,
ఉన్న వస్తువునే జ్ఞప్తికి తెచ్చుకోవడం... అంతే.

* * *

నేను ఎవడను? అని మనసు లోపల వెతుక్కుంటూ వెళ్లి హృదయస్థానానికి చేరుకున్నప్పుడు.....
ఈ వెతికే నేను తలక్రిందులుగ పడిపోతుంది.

(అనగా సముద్రపు లోతును కనుగొనడానికి ప్రయత్నించిన ఉప్పు బొమ్మవలె తన ఉనికిని కోల్పోతుంది)
వెంటనే నేను-నేను అంటూ మరో "నేను" తనకు తానుగా తోస్తుంది.

తోచినా అది అహంకారం కాదు,
అది పరిపూర్ణవస్తువు.

చిన్నపిల్లాడు తన వద్ద ఉన్న పావలా నాణెం
నాన్నకు ఇచ్చి రూపాయి నాణెం తీసుకున్నట్టు.

పావలాను పోగొట్టుకున్నట్టు అనిపిస్తుందేగాని,
అది పోలేదు. రూపాయిగా(పూర్ణంగా) మారుకుంది.

అలాంటిదే ఆత్మవిచారణలో ఈ "పరిమిత నేను" పోగొట్టుకుని, "పరిపూర్ణమైన నేను" పొందడం కూడా.

కష్టంగా అనిపించే సుఖం - ఆత్మవిచారం.
నష్టంగా కనిపించే లాభం - ఆత్మసాక్షాత్కారం.

* * * * * * * * * * * * * * * * * *

**122. ఋభుగీత**

ఋభువు:

నిధాఘా!
ఉన్నదెల్లా బ్రహ్మమే అన్న నమ్మకంతో ఉండు...
అనాత్మ అంటూ ఏమీలేదు...

మనస్సు అనాత్మ కాదు...
సృష్టి అనాత్మ కాదు...
అనాత్మగా ఏమీలేదు...

నాకు ప్రభువు లేడు...
నేను బ్రహ్మమును...

ఈ ప్రపంచము సృజించబడలేదు...
తనకు తానుగా నిలువదు...

ఇదొక చిత్రపటం...

ఇదెప్పుడూ అసత్యమే...

కర్త లేడు...

క్రియ లేదు...

కర్తవ్యము లేదు...

బ్రహ్మమొక్కటే సత్యము...

సర్వమూ బ్రహ్మము...

'సర్వము' అనునది ఒక భావము మాత్రమే...

నాకు బంధమూ లేదు, మోక్షమూ లేదు...

అక్షరమైన ఈ బ్రహ్మమే సర్వమూ.

"ఇది" అంటూ చూపదగినదేదీ లేదు...

గురువును త్యజించి...

అన్నిటినీ ఎల్లప్పుడూ త్యజించి...

మౌనముగా కూర్చుండుము...

సర్వత్యాగమే మహామోక్షము...

సర్వమును త్యజించుటే నిత్యసుఖము...

సర్వమును త్యజించుటే పరమానందము...

ఉన్నదెల్లా సదా పూర్ణమైన బ్రహ్మమే...

అని ఉన్నవాడు జీవన్ముక్తుడు...

జీవన్ముక్తుని వివరణము ఏ వేదాల్లోనూ లభించదు...

ఎల్లెడలా(అన్ని విషయాల్లో) మౌనియై...

ఏ ప్రయోజనమూ లేనివాడు విదేహముక్తుడు...

కాలభేదము...

దేశభేదము...

వస్తుభేదము...

స్వల్పమైనా భేదభావము లేనివాడు విదేహముక్తుడు...

తన ఉనికినే గుర్తింపనివాడు విదేహముక్తుడు...

దేని గురించీ ఏ నిశ్చయమూ లేనివాడు విదేహముక్తుడు...

ఆత్మ అవిభక్తము...

సమాధానము ఆత్మయందే సంస్థితము...

నిన్ను ఆత్మగానే భావించుకో...

ఆత్మనే వీక్షించు...

ఆత్మయందే ఉండు...

స్వాత్మయందే మోదము కలిగి ఉండు.

ఆత్మనే ప్రేమించు...

ఆత్మ గురించే చింతించు...

ఆత్మ వినా అన్యము లేదు...

ఆత్మకు అన్యముగా సుఖము లేదు...

ఆత్మకు భిన్నముగా ఏమీలేదు...

ఆత్మను విడచి ఎక్కడికీ వెళ్లలేవు...

సదా ఆత్మనిష్ఠుడవగుము...

స్రష్ట ఉంటేనే సృష్టి సంభవము...

అంతా కేవలము చిన్మాత్రమే(spiritual body)...

కార్యకారణరూపములు లేవు...

నేను దేహాతీతుడను...

నేను వేదాతీతుడను...

'నేను బ్రహ్మమును' అను నిశ్చయము కలవాడు బ్రహ్మజ్ఞాని...

చెదపట్టిన కట్టెను వలె...

తుప్పుపట్టిన ఇనుమును వలె...

తక్షణం నామరూప ద్వయాత్మకమును వదులు...

నోటితో ఏమి పలికినా...

మనసుతో ఏమి తలచినా...

అంతా మిథ్యే...

ఉన్నది కేవలం నేనే...

1. సర్వం నాస్తి

2.సర్వము బ్రహ్మం

ఈ రెండూ ఉత్తమోత్తమ మంత్రములు.

ఉచ్ఛరింపబడని మంత్రమే ఉత్తమ మంత్రము...

వృత్తి లేకుండుటయే మహనీయము...

'సర్వమూ బ్రహ్మమే' అన్న నిశ్చయమే పరమపదము...

'సర్వమూ బ్రహ్మమే' అన్న నిశ్చయమే సర్వపరిత్యాగము...

త్రిమూర్తుల రూపములు భ్రాంతి...

వర్ణాశ్రమ విభాగములు భ్రాంతి...

ఏదీ లేదు...

ఏదీ లేదు...

నేను కేవలము చైతన్యమే...

దీనినే పలుకు...

ఈ నిష్ఠలోనే ఉండు...

వెంటనే నీవు విముక్తుడవవుతావు...

అక్షరమైనది ఒకే అక్షరము అదే ఓంకారము...

ఆ ఏకాక్షరము నేను...

ఏకము నేను...

అన్యము కాను...

ఈ భావమును ఏ సందేహమూ లేక కలిగి "ఉండుము..."

నేను నేనే...
ఇట్లే నిత్యమూ భావిస్తూ ఆత్మనిష్ఠుడవగుము...

(ఆత్మకాక) ఏదైనా ఉన్నదన్న భావమే మిథ్య.
చూడవలసింది ఏమీలేదు అన్న ధృఢనిశ్చయంతో ఉండు.

నాకు ఏ స్తోత్రమూ లేదు...
అన్ని దేవతలను ప్రకాశింపచేతును...

సర్వమూ బ్రహ్మమే...
'ఈ దేహము నేను' అను భావమూ బ్రహ్మమే...
'ఈ సర్వము బ్రహ్మమే' అను భావమూ బ్రహ్మమే...
సందేహము లేదు...
నేను ఆ బ్రహ్మమును...సందేహము లేదు...
'ఏమీ లేదు' అనే మాట కూడా బ్రహ్మమే...

'అహం బ్రహ్మాస్మి' వాక్యాన్ని సదా వింటూ ఉండాలి.
నిరంతరము  తాను పరమాత్మననే భావించుకోవాలి.

'బ్రహ్మము నీవే' అని బోధించే గురువే పరమగురువు...
'నేను బ్రహ్మమును' అను నిశ్చయము కలిగిన సచ్ఛిష్యుడు పరబ్రహ్మమే అగును...

సంకల్పం వల్లనే బంధం కలుగుతుంది...
నిజంగా ఉన్నదల్లా బ్రహ్మమే...

'నేను బ్రహ్మము' అనే నిశ్చయభావమే ఆత్మజ్ఞానము...
ఇదే బంధనాశకము...

సందేహం లేదు...
ఇదే సిద్ధాంతాల సారము...

"ఇదంతా బ్రహ్మమే, నేను బ్రహ్మము"
ఇదే ధ్యానింపవలసినది...
ఇది భగవంతుని వాక్కు...
ఇది సత్యమని విశ్వసించు...

* * *

ఆత్మ కర్త అనడం సరి కాదు;
ఆత్మ కర్తృత్వం వహించదు.
కుండకు మట్టి కారణమైనట్లు
జగత్తుకు ఆత్మ పరమ కారణము.

* * *

బ్రహ్మము-
నాసిక లేకయే ఆఘ్రాణించును. (to smell)
నేత్రము లేకయే విలోకించును. (to see)
కర్ణము లేకయే ఆకర్ణించును.(to listen)

* * *

ఈ గ్రంథమే పరబ్రహ్మము...
ఇందులో సర్వజ్ఞానమున్నది...
ఇదే పరమపదము...
గురువును పరిత్యజించైనా ఇందులో దానిని అభ్యసించు...

అన్ని శాస్త్రములను పరిత్యజించి...
దీనిని ప్రతిదినము పఠించిన మోక్షము తథ్యము...

తడుపలేని బృహత్ స్వరూపమునకు అభిషేకము చేసెదరు.

* * *

దిక్కులే అంబరముగా గలవానికి వస్త్రములు సమర్పించెదరు.

* * *

వాసనలు లేనివానికి గంధము నలంకరించెదరు.

* * *

రూపము లేనివానికి పూలతో పూజించెదరు.

* * *

స్వయంప్రకాశునకు దీపము నిచ్చెదరు.

* * *

సర్వమును మ్రింగినవానికి నైవేద్యము సమర్పించెదరు.

* * *

సర్వత్రా వ్యాపించినవానికి ప్రదక్షిణ చేసెదరు.

* * *

జ్ఞానులు అంతఃకరణముతో లోలోపలే పూజించెదరు.

* * *

పరమేశ్వరుడు భావార్చన చేయువారికి ఆత్మపదమునిచ్చును.

* * *

నిధాఘుడు:

గురువర్యా! తమరి అనుగ్రహము వలన...

నా అజ్ఞానము...

నా మహాదోషము...

నా మహాభయమూ...

కర్మాచరణలో విశ్వాసము...

ప్రపంచమే సత్యమనే భావన...

అన్నీ క్షణములో నశించిపోయాయి...

నా అజ్ఞానము బ్రహ్మత్వంగా మారింది...

నా మనసు పరబ్రహ్మంగా మారింది...

ఏకమనే సాగరంలో మునిగి ఉన్నాను...

నాకేమీ గోచరము కాదు...

గురువు అన్యుడుగా కానరాడు...

సర్వమూ పరబ్రహ్మము...

ఈ నిశ్చయముతో స్వస్వరూపములో...

స్వాత్మనిష్ఠుడను సదా...

* * *

ఋభువు:

నిధాఘా! ఈ నిశ్చయమే నీలో దృఢముగ నిలుచుగాక...

* * * * * * * * * * * * * * * * * * *

**123. "నేనే" సత్యం, ధర్మం, న్యాయం.**

**Opposites are Interdependent.**

మంచి-చెడు

పుణ్యము-పాపము

స్వర్గము-నరకము

గెలుపు-ఓటమి

స్తుతి-నింద

గౌరవము-అవమానము

పగలు-రాత్రి

ఇవి ద్వంద్వములు...

* * *

చూచేవాడు-చూడబడేది-చూపు

తెలుసుకునేవాడు-తెలియబడేది-తెలివి

అనుభవించేవాడు-అనుభవింపబడేది-అనుభవము

ఇవి త్రిపుటులు.

* * *

ప్రపంచానుభవం అంటే....

ఈ ద్వంద్వములు, త్రిపుటులే...ఇంకేమీ లేదు...

ద్వంద్వములలోగానీ, త్రిపుటులలోగానీ

అందులో ఏ ఒక్కటి లేకపోయినా మిగతా వాటికి ఉనికి ఉండదు.

పరస్పరాశ్రయంతోనే అవి ఉంటాయి.( They are interdependent, not independent).

అవి అలా పరస్పరాశ్రయంతో ఉండబట్టే మనకు ఏ అనుభవమైనా కలిగేది.

ఇవి సాపేక్షములు (relatives, opposites)....

చెడు అనేది లేకుంటే ఒకటి మంచి అనడానికి అవకాశం ఉండదు....

అనుభవించేవాడు లేకుంటే అనుభవింపబడేది, అనుభవము ఉండవు...

దీనినే "పరస్పర ఆశ్రయ వ్యవహార స్థితి" అన్నారు భగవాన్.

అంటే వ్యతిరేకాలైన ద్వందాలు, త్రిపుటులు అలాగే జీవజగదీశ్వరులు,

తమోగుణం-రజోగుణం-సత్వగుణం,

పాజిటివ్-నెగెటివ్-న్యూట్రల్,

ఎలక్ట్రాన్స్-ప్రోట్రాన్స్-న్యూట్రాన్స్,

కఫ-వాత-పిత్త, మొదలైనవి  ఒకదాని మీద ఒకటి ఆధారపడతాయి Inter dependence. అలాంటప్పుడు ఏది ముందు, ఏది వెనుక అని చెప్పలేము. చెట్టు విత్తు సంబంధం లాంటిది. రెండూ సాపేక్ష Relative మయినప్పుడు ఏదీ స్వతస్సిద్ధం(independent, permanent) కాదు.  అవి ఆభాసలు (shadows, temporary medium, duplicate). మరి వస్తువేది( original truth). రెండూ కలిసి దేనిమీద ఆధారపడతాయో అది. అది స్వతస్సిద్ధమైన ఆత్మే మరేదీగాదు.

* * *

ఈ ఆత్మను అనుభవములోకి తెచ్చుకునేదెలా?
అని  అడిగినప్పుడు....

పరస్పర ఆశ్రయ వ్యవహారస్థితిని దాటిపో.....
అన్నారు భగవాన్.

* * *

చూసేవాడు దృక్కు,
చూడబడేది దృశ్యము
ఈ రెంటిలోనూ అంతర్లీనంగా ఒక ఏకత్వము ఉండి తీరాలి.
అదే ఆత్మ.

ఆత్మే మనసుగా, దృశ్యంగా విస్తరిల్లుతుంది.

దృశ్యం నశించేవరకు(అనగా చూసేవాడు, చూడబడేది వేరు వేరు అనే భావన తొలిగే వరకు)
ఉండే దృక్కు - జీవుడు.

దృశ్యాన్ని (అహంకారంతో సహా)తొలగిస్తే
మిగిలిఉండే దృక్కు - దేవుడు.

మానసికం(అనగా పరస్పర ఆశ్రయ వ్యవహారం) అంతమయిన చోట

తాత్వికం(అనగా అనుభవం) మొదలవుతుంది.

* * *

మనసు యెలా అంతమౌతుంది?

మనస్సు యొక్క స్వస్థానమైన హృదయంలో
నిలకడ కలిగి ఉన్నప్పుడు ఆలోచనలన్నీ నిమ్మళించి
మనసే ఆత్మగా ప్రకాశిస్తుంది.

ఈ ఆత్మనిష్ఠ వలన ప్రయోజనమేమి? అని అడిగినప్పుడు భగవాన్ ఇలా సమాధానమిచ్చారు-

1. సంకల్పం నెగ్గుతుంది - ఏకాగ్రత పెరగడం.

2. మనోవికారాల పై (వ్యతిరేక ఆలోచనలపై) విజయం - వైరాగ్యం పెరగడం.

3. ధర్మాచరణం పెరుగుతుంది - అందరి యెడల సమత్వం.

* * *

వ్యవహారంలో ఉన్న
ధర్మాధర్మాలు రెండూ అధర్మమే.
న్యాయాన్యాయములు రెండూ అన్యాయమే.
సత్యాసత్యములు రెండూ అసత్యమే.
జ్ఞానాజ్ఞానములు రెండూ అజ్ఞానమే.

* * *

మరీ యెక్కువగా లేకుండా
తక్కువగా ఉన్న అధర్మానికే ధర్మం అని పేరు.

లోకంలో(అంటే వ్యవహారంలో) ఉన్న ధర్మాలన్నీ అధర్మాలే.

అందుకే భగవానుడు గీతలో సర్వధర్మాన్ పరిత్యజ్య అన్నాడు....సర్వధర్మాలను వదిలిపెట్టు....అని.

మామేకం శరణం వ్రజ....నన్నొక్కణ్ణే శరణువేడు...అన్నాడు....

భగవంతుడొక్కడే పరమధర్మం....మిగతావన్నీ సాపేక్షధర్మాలే....అనగా ధర్మాధర్మరూపంలో ఉన్న అధర్మమే.

* * *

మరీ యెక్కువగా లేకుండా
తక్కువగా ఉన్న అన్యాయానికే న్యాయం అని పేరు.

రాజు చేస్తే శృంగారం
చాకలి చేస్తే వ్యభిచారం
అని సామెత.

ఒకే పనిని
ఒకడు చేస్తే న్యాయం.
మరొకడు చేస్తే అన్యాయం.

ఈ న్యాయాన్యాయములు అనేవి వ్యక్తిని బట్టి, ప్రాంతాన్ని బట్టి, పరిస్థితిని బట్టి మారుతూ ఉంటాయి.

స్థిరత్వం లేని ఈ న్యాయాన్యాయములు రెండూ అన్యాయమే.

ఈ విశ్వకుటుంబానికి యజమాని అయిన భగవంతుడు చేసే ఏ సంకల్పమైనా, ఏ పనైనా
అది న్యాయమే.

భగవంతునికి శరణుచెందిన భక్తునికి
న్యాయమే తప్ప అన్యాయము కనబడదు.

* * *

మరీ యెక్కువగా లేకుండా
తక్కువగా ఉన్న అసత్యానికే సత్యం అని పేరు.

నామరూపాలు లేని ఆత్మస్వరూపమే తాను అనేది పరమసత్యం.

అది వదిలి(మరచి)

నేను "హరిశ్చంద్రుడను" అని అనుకుంటున్నాడు.

నేను హరిశ్చంద్రుడను అనేదే అసత్యం.

అసత్యం పై నిలబడి చెప్పే ఎంతటి సత్యమైనా అది అసత్యమే అవుతుంది.

ఒకడు పేపరు, పెన్ను దొంగిలించి....ఆ కాగితం మీద ఆ పెన్నుతో "దొంగతనం చేయరాదు" అని వ్రాయడం లాంటిది....లోకంలో ఉన్న సత్యవాక్కులన్నీ.

* * *

మరీ యెక్కువగా లేకుండా
తక్కువగా ఉన్న అజ్ఞానానికే జ్ఞానం అని పేరు.

జ్ఞానమంటే విషయసేకరణ కాదు,
విషయ పరిత్యాగం.

జ్ఞానమంటే విషయం కాదు, "విషయి".

జ్ఞానమంటే నీవు తెలుసుకునేది కాదు,
నిన్ను తెలుసుకునేది.

వ్యవహారంలో ఉన్న జ్ఞానాజ్ఞానములు రెండూ అజ్ఞానమే.

అజ్ఞానాన్నే -
కొంత భాగాన్ని జ్ఞానం పేరుతో
కొంత భాగాన్ని అజ్ఞానం పేరుతో
వ్యవహరిస్తున్నాం.

* * *

జ్ఞానము లేక అజ్ఞానము లేదు.
అజ్ఞానము లేక జ్ఞానము లేదు.

ఇవి పరస్పరాశ్రయములు.

సాపేక్షములు.

ఆ జ్ఞానాజ్ఞానములు ఎవరికి? అని విచారించి

తన్ను తాను తెలియు జ్ఞానమే జ్ఞానము అన్నారు భగవాను.

* * *

జ్ఞాత(విషయి)వద్దనే ఆగిపోవడమే జ్ఞానం.

తలంపు పుట్టు చోటులోనే ఆగిపోవడమే జ్ఞానం.

సదా ఆత్మనిష్ఠలో ఉండిపోవడమే జ్ఞానం.

* * *

నీకు తెలియనిది - అజ్ఞానం.

నీవు తెలుసుకునేది - విజ్ఞానం.

నిన్ను తెలుసుకునేది - జ్ఞానం.

* * * * * * * * * * * * * * * * * *

**124. దేహం నాలోనిది**

జ్ఞానికి, అజ్ఞానికి ఇద్దరికీ దేహం ఉంటుంది.

"దేహములో నేనున్నాను" అని అంటాడు అజ్ఞాని.

"దేహం నాలోనిది" అని ఉంటాడు జ్ఞాని.

* * *

ఓ వార్డు కౌన్సిలర్ కౌన్సిల్ సభలో 'నేను' అంటే

ఆ 'నేను' అతని వార్డు అంత.

ఓ దేశప్రధాని ఐక్యరాజ్య సమితిలో 'నేను' అంటే

ఆ 'నేను' అతని దేశమంత.

అజ్ఞాని 'నేను' అంటే
ఆ 'నేను' అతని దేహమంత.

జ్ఞాని 'నేను' అంటే
ఆ 'నేను' మొత్తం విశ్వమంత.

అజ్ఞాని 'నేను' హద్దులుండే నేను.
జ్ఞాని 'నేను' హద్దులేని నేను.
* * *

పెద్దలకు, పసిబాలురకు ఆటబొమ్మ సమంగానే కనిపిస్తుంది.

పసిబాలురు ఆటబొమ్మ నిజం అన్నట్టు దానితో మాట్లాడుతూ ఆడుకుంటూ ఉంటారు.

పెద్దవారికి ఆ భ్రాంతి ఉండదు.

అలాగే అజ్ఞాని ఈ మనుషులు, ఈ వ్యవహారాలు అన్నీ సత్యమే అన్నట్టు ప్రవర్తిస్తాడు.

జ్ఞాని మాత్రం ఈ రూపాల మాయలో పడక నిరాసక్తంగా ఉంటాడు.

నిరాసక్తతే నిర్వాణం.

* * *

జ్ఞానికి, అజ్ఞానికి జగత్తు సత్యమే.

అజ్ఞానికి జగత్తే సత్యము.
జ్ఞానికి సత్యమే జగత్తు.

అజ్ఞాని చూపు నేరుగా రూపాలపైన పడుతుంది.
జ్ఞాని చూపు మొదట చైతన్యం పైన పడి, తర్వాత రూపం వైపుకు ప్రసరిస్తుంది.

అజ్ఞాని కుండను చూస్తాడు.
జ్ఞాని మట్టిని చూస్తాడు.

ఇదే వీరికుండే వ్యత్యాసం.

* * *

అజ్ఞాని ఉండే ప్రపంచంలోనే జ్ఞాని కూడా ఉన్నట్టు కనిపిస్తాడు.
అజ్ఞానికి వలె జ్ఞానికి కూడా అన్ని వ్యవహారాలు ఉన్నట్టు కనిపిస్తుంది.

ప్రపంచంలో అజ్ఞాని ఉంటాడు.
జ్ఞానిలో ప్రపంచం ఉంటుంది.

ఇదే వీరికుండే వ్యత్యాసం.

* * *

అజ్ఞానికి-
జగత్తు సత్యము.
చైతన్యము ఊహ.

జ్ఞానికి-
జగత్తు ఊహ.
చైతన్యము సత్యము.

ఇదే వీరికుండే వ్యత్యాసం.

* * * * * * * * * * * * * * * * * *

**125. ప్రియం - వైరం**

చిలకమ్మకు ఓ రోజు తీవ్రజ్వరం చేసింది...
గురువుగారికి ఫోన్ చేసి చెప్పుకుంది...

ఈశ్వరుణ్ణి ప్రార్థించు...అన్నారు.

మళ్లీ చిలకమ్మ నుంచి ఫోను....

"గురువుగారు జ్వరం తగ్గలేదు..."అని.

"ఈశ్వరుణ్ణి నీ నోటికొచ్చినట్టు తిట్టు..."అన్నారు.

చిలకమ్మ నుండి మళ్ళీ ఫోను...
"గురువుగారూ...! జ్వరం తగ్గిపోయింది..."అని.

* * *

ఈ సన్నివేశం చెప్పడం యొక్క ఉద్దేశం-
భగవంతుణ్ణి అందరూ తిట్టమని చెప్పడం కాదు.

కర్త (భగవంతుడు) ఒక్కడే అయినప్పుడు...
ప్రార్థన అయినా వానితోనే, తిట్టడం అయినా వానితోనే.
ఇక వేరే మార్గం లేదు.

* * *

మన పురాణాలలో-
భక్తి ద్వారా ముక్తి పొందినవారూ ఉన్నారు.
వైరముతో ముక్తి పొందినవారూ ఉన్నారు.

వైరముననైన తగిలి తలంపగవచ్చు వేరుసేయడతడు...

ప్రియము-వైరము
అదొక మార్గం, ఇదొక మార్గం...అంతే.

* * *

ఆత్మతత్త్వం శుద్ధ బంగారంతో సమానం.

శుద్ధబంగారంతో నగలు చేయడం కుదరదు.

అందులో కాస్త రాగి కలిపితేనే నగల తయారీకి అనుకూలం అవుతుంది.

అలాగే శుద్ధఆత్మతత్త్వం బోధనకు వీలుకాదు.

అలా అని దాన్ని అలా వదిలేయలేం.

శిష్యుని అజ్ఞానాన్ని తొలగించడానికి

ఆ శుద్ధతత్త్వంలో

కాస్త అజ్ఞానాన్ని రంగరిస్తేనే అది బోధనకు అనుకూలం అవుతుంది.

* * *

యెంతటి మహనీయుడైనా సరే బోధనకు పూనుకున్నప్పుడు అందులో అప్పుడప్పుడు స్వవచోవిఘాతాలు(self contradiction), పునరుక్తులు గోచరిస్తుంటాయి. తప్పదు...

మనం వాటిని దోషాలుగా పరిగణించకూడదు.

వారు యెంతో దయతో మన అజ్ఞానాన్ని రూపుమాపడానికి పడుతున్న తపనగా గుర్తించి,

వారి యెడల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలి.

"అంతా ఆత్మస్వరూపమే అయినప్పుడు,

మరి మీరు ఇతరులకు బోధించడం యెందుకు?

ఆత్మ ఆత్మకు బోధించడం అవసరమా?"

అని గురువులను ఆక్షేపించకూడదు.

భాషకు ఉన్న పరిమితులు అవి.

ఈ భాష అనే మాధ్యమం నుంచే అనంతవస్తువు గురించి చెప్పాలి.

ఆర్తితో తనకు శరణాగతి చెందిన శిష్యుల ఉద్ధతికి గురువు పడే తపనే బోధ.

అంతేగాని దారినపోయేవారిని పిలిచి ఆత్మబోధ చేయడు గురువు.

శిష్యుని యొక్క శ్రద్ధయే బాహ్యంగా గురువుగా
వ్యక్తమౌతుంది.
* * *
తన్ను (నేను అనే అహమికను) మ్రింగి ఉప్పొంగిన
తన్మయానందుడు గురువు.

అతనికి "నేను" తప్ప అన్యంగా ఏమీ ఉండదు.

కాబట్టి గురువుకు "కర్తవ్యం" అంటూ ఏమీ ఉండదు.

బోధించడం, సంస్కరించడం, లోకసేవ....ఇలాంటి  కర్తవ్యాలేవీ లేని నిరామయుడు గురువు.

తాను జ్ఞాని అయితేగాని జ్ఞానిని గుర్తించలేడు,
తాను జ్ఞాని అయితే, తనకు జ్ఞానం తప్ప ఇతరం గోచరించదు.

అజ్ఞానికి జ్ఞాని కనబడడు.
జ్ఞానికి అజ్ఞాని కనబడడు.

అజ్ఞానికి తెలియక.
జ్ఞానికి అన్యం లేక.

కాబట్టి "జ్ఞాని స్థితి ఇది" అని
అజ్ఞానీ చెప్పలేడు, జ్ఞానీ చెప్పలేడు.

ఇట్టివాడవని అట్టివాడవని
ఎట్టుల తలతుర అనిలాచలా!
అంటారు గురుదేవులవారు.
* * *
తనదే అయి ఉన్న
తనలోనే ఉన్న
తానే అయి ఉన్న

ఆత్మవస్తువును నాకు తెలియదు అనడం హాస్యాస్పదం.

యెందుకంటే, దానికంటే తెలిసిన విషయం మరొకటి లేదు.
ఆత్మ మనకు బాగా తెలిసిన వస్తువే.

నీటిలో పుట్టిన నాచు ఆ నీటినే కప్పి వేసినట్టు
ఆత్మలో పుట్టిన అహమిక(అబద్ధపు నేను) ఆత్మనే కమ్మివేసినది.

'నేను' అన్న అహమిక పుట్టాకే
తనువు, జగత్తు పుట్టాయి...

'నేను' అన్న అహమిక పుట్టక ముందు ఉన్న స్థితియే
తన యధార్థమైన స్థితి.

అలలు(ఆలోచనలు) లేని మానస సరోవరమే హృదయము...అదియే ఆత్మస్థానము.

'నేను' పుట్టని చోటుకు చేరాలంటే
'నేను' పుట్టే చోటును వెతికి చేరాలి.

అనగా ఈ నేను ద్వారానే ఆ నేనును చేరాలి.
ఈ వైపు నుంచి చూస్తే రెండు నేనులు ఉంటాయి....
తెలుసుకునే నేను, తెలియబడే నేను అని.
ఆ వైపు నుంచి చూస్తే ఉండేది ఒకే నేను.
* * *
అద్దంలో తనను తాను చూసుకున్న వ్యక్తి
తాను ఇద్దరు అని భ్రమపడతాడా?
ఇద్దరు ఉన్నట్టు కనబడినా ఉండేది ఒకనికే.

అలా ఆ ఏకాత్మ స్థానంలోకి చేరుకున్నాక
'అనేకం' ఇబ్బంది కలిగించదు.

'ఏకం' తెలియనివారే 'అనేకం' వల్ల ఇబ్బంది పడేది.

ఉన్న సమస్తము పుట్టక పూర్వము
ఉన్నది నీవే అనిలాచలా!
అంటారు గురుదేవులు.

ఆ ఏకాత్మస్థానంలో ఉన్నవానికి-
"నేనే కేంద్రం" అన్న అనుభవం కలుగుతుంది.

సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాల్లా
త్రిమూర్తులతో సహా సకల సృష్టి "నేను" చుట్టూ తిరుగుతోందనే అనుభూతి కలుగుతుంది.
దీనికే బ్రహ్మానుభూతి అని పేరు.

* * *

వ్యక్తి అన్నీ తానే చేస్తాడు... ఓ రెండు పనులు తప్ప....

1.శ్వాసించడం.
2.'నేను' అనడం.

నిజానికి ఈ రెండూ ఈశ్వరునివి.
కాని వ్యక్తి తానే శ్వాసిస్తున్నట్టు,
తానే 'నేను' అంటున్నట్టు భ్రమపడతాడు.

నిజంగా తానే శ్వాసించేటట్టయితే,
"చివరి శ్వాస" ఎందుకు వదులుతాడు?

* * *

చిత్తం చలిస్తే బంధం కలుగుతుంది.
నిశ్చలం అయితే మోక్షం కలుగుతుంది.
తెలివైనవారు మనసును నిశ్చలం చేసే పనిలో ఉంటారు.

మనసు నిశ్చలం చేయడమే తీర్థం, దానం, తపస్సు.

మనసు బహిర్ముఖమైతే అది జీవితగమనం.
మనసు అంతర్ముఖమైతే అది జీవితగమ్యం.

* * * * * * * * * * * * * * * * * * * * *

**126. "నేనే" విశ్వకేంద్రం**

అన్యం లేని "నేను" జ్ఞానం.
అన్యం ఉండే నేను అజ్ఞానం.

ఏకాత్మస్వరూపుడైన తానే సత్యం.
ప్రపంచరూపంగా ఉండే నానాకార జ్ఞానం అజ్ఞానం.

అసత్యమైన ఆ జ్ఞాన,విజ్ఞానములు కూడా
సత్యజ్ఞానమైన "తన" కన్నా వేరుగా లేవు.

పలువిధములైన నగలు సత్యము కావు.
అవి సత్యమైన బంగారమును వదిలి ఉండగలవా? అన్నారు రమణులు.

అమాయకుడైన ఒకడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తాతల నాటి బంగారు గణపతి విగ్రహాన్ని అమ్మటానికి తీసుకెళ్లాడు...
శేఠ్ గణపతిని, గొడుగును, సింహాసనాన్ని, ఎలుకను తూచి వెలకట్టాడు.

శేఠ్ వ్రాసిన ఆ పట్టీ చూచి గొడవపడ్డాడు
ఆ అమాయకుడు...

గణపతికీ అదే రేటు, ఎలుకకూ అదేరేటా? అని

శేఠ్ నవ్వి, నాకు గణపతి అయితే ఏమి? ఎలుక అయితే ఏమి?

నాకు కావలసింది బంగారం....ఈ నామరూపాలతో నాకు పనిలేదు...అన్నాడు.

అలాగే నామరూపాలను చూసేవాడు అజ్ఞాని.
నామరూపాలకు అధిష్ఠానంగా ఉన్న ఆత్మను చూసేవాడు జ్ఞాని.

* * *

అన్నింటిలో భగవంతుణ్ణి చూసేవాడు విశిష్టాద్వైతి.

ముందు నామరూపాలు చూసి
తరువాత ఆత్మను చూస్తాడు ఈ భక్తియోగి.

* * *

భగవంతునిలో అన్నింటినీ చూసేవాడు అద్వైతి.

ముందు ఆత్మను చూసి
తరువాత నామరూపాలు చూస్తాడు ఈ జ్ఞానయోగి.

* * *

నేను - ఉత్తమ పురుషము(మనస్సు)
నీవు - మధ్యమ పురుషము(జగత్తు)
వాడు - ప్రధమపురుషము(జగదీశ్వరుడు)

* * *

విశ్వకేంద్రం - 'నేను'.

'నేనే'(మనస్సే) జగత్తుగా, జగదీశ్వరునిగా వ్యక్తం అయ్యింది.

ఈ ఉత్తమపురుషమైన 'నేను'యొక్క తత్త్వాన్ని తెలుసుకోవడం వలన,

అనగా 'నేనెవడను?' అని ఆత్మవిచారణ చేయడం వలన 'నేను' అనేది మిథ్య (లేనిదే) అని తెలుస్తుంది.

'నేను' అనేదే మిథ్య అయినప్పుడు
దానిని ఆధారం చేసుకుని ఉనికి గలిగి ఉన్న
నీవు, వాడు కూడా మిథ్యే అవుతాయి.
లేనివే అవుతాయి.

ఈ మూడూ లేకుండా  పోవడం అంటే
శూన్యమైపోవడం కాదు.
మూడూ కలిసి ముద్దగా పరిపూర్ణవస్తువుగా తయారవ్వడం అన్నమాట.

ఆ పరిపూర్ణవస్తువే 'అసలు నేను'.

* * *

ఉండేది వర్తమానం ఒక్కటే.

గడిచిన వర్తమానం - భూతకాలం.
రాబోవు వర్తమానం - భవిష్యత్కాలం.

భూతకాలం గానీ, భవిష్యత్కాలం గానీ
ఆయా సమయాల్లో వర్తమానమే.

ఏ క్షణానికాక్షణం ఉండేది వర్తమానమే.

* * *

పురుషత్రయంలో 'నేను' లేకపోతే
నీవు-వాడు ఎలా ఉండవో

కాలత్రయంలో 'వర్తమానం' లేకపోతే
భూత-భవిష్యములు కూడా ఉండవు.

* * *

నదిగట్టున చేరి యెడతెగని ప్రహాహాన్ని చూస్తుంటే
ప్రస్తుతక్షణంలో నీ యెదుట ఉన్న నీరు - వర్తమానం.

జరిగిపోయిన నీరు - భూతకాలం.

పై నుంచి వచ్చే నీరు - భవిష్యత్కాలము.

ఆయా సందర్భాన్ని అనుసరించి ఆత్మనే
ఈశ్వరుడు-జీవుడు-జగత్తులుగా చెప్పుకున్నట్టు

ఆయా సందర్భంలో వర్తమానాన్నే
భూత-భవిష్యత్తు-వర్తమానములుగా చెప్పుకుంటున్నాము.

"ఇప్పుడు" (వర్తమానం) యొక్క తత్త్వాన్ని తెలుసుకోకుండా భూత-భవిష్యత్తుల గురించిన ఆలోచించడం ఎలా ఉంటుదంటే-

"ఒకటి"ని వదిలి లెక్క పెట్టినట్లు ఉంటుంది.
ఆ లెక్క వృధా.

"నేను" (ఆత్మ)ను వదలి లోకాన్ని గురించి, దైవాన్ని గురించి ఆలోచించడం కూడా వృధా.

* * *

వర్తమానం ఒక్కటే ఉన్నది.
వర్తమానమే పరమగు దైవం.
అది సనాతనం.

ఆద్యంతరహితం.

శాశ్వతం.

మార్పు లేనిది.

* * *

గడియారం - వర్తమానం.

గడియారంలోని ముల్లులు - భూత-భవిష్యములు.

గడియారం కదలదు.

ముల్లులు కదులుతూ ఉంటాయి.

* * *

ప్రవాహం కదిలి వెళుతున్నప్పటికీ

నది శాశ్వతంగా అక్కడే ఉంటుంది.

నీరుగా అశాశ్వతం.

నదిగా శాశ్వతం.

వ్యక్తిగా అశాశ్వతం.

ఆత్మగా శాశ్వతం.

* * *

'కాలం మారింది' అని వ్యవహారంలో వాడుతామేగాని,

మారేది కాలం కాదు మన మనస్సు.

కానీ మనం ఆ మార్పును కాలానికి ఆపాదిస్తాం.

గీతలో కూడా 'కాలోస్మి' అన్నారు...

'నేను కాలమును' అంటే,

'నేనే' కాలమును...

'నేనే' వర్తమానమును...

అని అర్థం.

* * *

తాను పరిమితంగా ఉన్నప్పుడు

అంటే ఈ తనువు మాత్రమే నేను అని తానున్నప్పుడు

దేశకాలాలు, కార్యకారణాలు, విధిమతులు...

అన్నీ తనపై ప్రభావం చూపుతాయి.

'మొత్తంగా తానున్నప్పుడు' ఇవేవీ పనిచేయవు.

తన'లో ' ఉంటాయేగాని తనపై పనిచేయవు.

పాములోని విషపుకోర వలన పాముకు ఏ హానీ లేనట్లు.

మనము ఈ దేహమాత్రమేనా? అని విచారించినప్పుడు

ఇది మాత్రమే నేను కాదు,

నాతో సహా సకలమూ 'నాలో ' ఉన్నది అనే 'మొత్తపుతత్త్వము'గా అనుభవంలోకి వస్తుంది.

* * *

బిందు సముదాయం - సముద్రం.

ధూళి సముదాయం - భూమి.

జీవసముదాయం - 'నేను'(దైవం).

* * *

వ్యవహారంలో నేను-నీవు-అతడు అనే బేధాలున్నప్పటికీ, తాత్త్వికంగా అంతా 'ఒక్కటే'.

వ్యవహారంలో అన్నింటిలో, అందరిలో ఒకటిగా, ఒకరుగా ఉంటూ...

అనుభవంలో తనతో సహా అన్నీ 'ఒకటి'లో ఉండడమే

ఆధ్యాత్మిక లక్ష్యం.

* * *

ఇప్పుడు-అప్పుడు-ఎప్పుడూ ఒకరమే.
ఇక్కడ-అక్కడ-ఎక్కడా ఏకమే.

* * * * * * * * * * * * * * * * *

**127. శీలమంటే పారదర్శకత**

నిద్రలో తానున్నానని తనకు తెలియకపోయినా తానున్నాడు.

యెందుకంటే మెలకువ రాగానే నేను హాయిగా నిద్రపోయాను అంటాడు.

'హాయి'ని అనుభవించేవాడు అక్కడ ఒకడు ఉండే ఉండాలి.

నిజానికి ఆ 'హాయే' తాను.
మెలకువలో ఉండి, హాయిని కోరేవాడు కాదు తాను.

ఆ 'హాయే' ఆత్మ, భగవంతుడు....ఇత్యాది పేర్లతో పిలువబడుతున్నాడు.

ఆ 'హాయి'గా ఉన్న తానే...
ఆ ఏకంగా ఉన్న తానే....
చెదరి... కదలి...మనసుగా మారి...
మెలకువలోకి...కలలోకి జారి...
ఈ ప్రత్యేకమైన తానుగా
అనగా పరిమితమైన తానుగా...

జగత్తుగా విస్తరిల్లాడు....

ఏకంగా ఉన్న తానే అనేకం ఐన సంగతిని మరిచి...
ఆ అనేకంలో ఏదో ఒక నామరూపాలు కలిగిన దేహాన్ని మాత్రమే తానని అభిమానించి...
దానితో మమేకం అయ్యి...
అది మాత్రమే తానని వ్యవహరిస్తూ...
జీవిస్తూ...
నానా అవస్థలు పడుతున్నాడు...
ఇదంతా మరపు వలన వచ్చిన అవస్థలే...

మరపుతో ఉన్న అవస్థలే - జాగ్రత్-స్వప్న-సుషుప్తులు.

ఎరుకతో ఉన్న అవస్థ - తురీయం.

* * *

నిద్రలో ఉన్న హాయిని,
మెలకువలో ఉన్న ఎరుకను
అనుసంధానం చేసే ప్రక్రియే - ధ్యానం.

* * *

స్వస్వరూపమైన ఆ 'హాయి'ని తిరిగి పొందటానికి
జీవుడు గురువును ఆశ్రయిస్తాడు...

గురువు అంటే తనకు విడిగా ఉన్న ఓ వ్యక్తి అని కాదు...
తనలోనే, తనకు అభిన్నంగా ఉన్న ఓ 'ప్రజ్ఞ' అది.

యెప్పటికీ అలా తాను మరపులో ఉండకుండా
మళ్లీ తానెవరో గుర్తుకు తెచ్చే ఆ ప్రజ్ఞయే 'గురువు'.

కొందరికి ఆ గురువు పైకి ఓ వ్యక్తిలాగే కనబడవచ్చు...

కొందరికి ఆ గురువు పైకి కనబడకపోవచ్చు...

ప్రజ్ఞయే సాకారంగా ఉంటే - గురువు.
ప్రజ్ఞయే నిరాకారంగా ఉంటే - ఈశ్వరుడు.

గుర్తుకు తెచ్చేవాడు గురువు.
వస్తువు ఇచ్చేవాడు కాదు.

నీదే, నీవే అయిన ఆత్మవస్తువును
గురువూ ఇవ్వలేడు, దేవుడూ ఇవ్వలేడు.
నిన్ను నీలోలోపలికి(ధ్యానంలోకి) త్రోయడం తప్ప.

* * *

అనంతమైన వస్తువు - సద్వస్తువు.
అది 'నేను'గా ఉంటుందేగాని 'నేను' అని అనదు, అనుకోదు.

పరిమితమైన ప్రతి వస్తువూ జడమే.
జడవస్తువు 'నేను' అని అనదు, అనుకోదు.

* * *

సద్వస్తువు 'నేను' అనదు - అన్యము లేక.
జడశరీరము 'నేను' అనదు - ఉనికి లేక.

ఈ మధ్యలో, ఈ రెంటి స్పర్శతో, దేహపరిమాణంలో
'నేను' అని ఒకటి పుడుతోంది.

* * *

విమానం జడం - పైలట్ లేకుండా ఎగురదు.

పైలట్ చైతన్యం - విమానం లేకుండా ఎగురలేడు.

ఈ రెంటి కలయిక వలననే విమానం ఎగురుతుంది.

శివ-శక్తుల కలయికే ఈ సృష్టి చలనానికి మూలం.

* * *

కాబట్టి జీవుడు -

పూర్తిగా జడమూ కాదు,

పూర్తిగా చైతన్యమూ కాదు.

జడ-చైతన్యముల కలయికే జీవుడు...

అదే చిజ్జడగ్రంథి...

అదే బంధము...

అదే జీవుడు...

అదే సూక్ష్మశరీరము...

అదే అహంకారము...

అదే సంసారము...

అదే మనస్సు...

* * *

మా మేనమామగారి అబ్బాయి ఆనంద్ అడిగాడు-

మహనీయులు భారతదేశంలోనే యెందుకు పుడుతుంటారు? విదేశాల్లో అటువంటి పుట్టుకలు యెందుకు జరగడం లేదు? అని.

* * *

ఓ పదహారేళ్ల కుర్రవాడు(రమణుడు) దేవునికోసమని ఇల్లు వదిలి

అరుణాచలం చేరి, ధనం, వస్త్రం పరిత్యజించి

కేవలం "గోచీతో నిలబడడం" అనే అద్భుతమైన ఘట్టం

నాకు రోజులో ఒక్కసారైనా గుర్తుకువస్తుంటుంది.

ఆ పదహారేళ్ల కుర్రవాడే - భగవాన్ శ్రీరమణ మహర్షి.

చదివింది ఫిఫ్త్ ఫామ్.
కానీ పండితులకు, పీఠాధిపతులకు సైతం అవగతం కాని తాత్త్విక విషయాలెన్నింటినో బోధించారు.

ఎలా వచ్చింది ఆ కుర్రాడికి ఆ శక్తి? ఆ జ్ఞానం?

ఓ పువ్వు పుట్టినట్టు, ఓ మెరుపు మెరిసినట్టు
జ్ఞాని అలా పుడతాడు సహజంగా.

జ్ఞానికావడానికి-
కోచింగ్ సెంటర్లు లేవు,
text books లేవు,
రిజర్వేషన్లు లేవు,
రెకమెండేషన్లూ లేవు.

ఈ పవిత్ర భారతభూమిలో అటువంటి జ్ఞానవృక్షాలు సహజంగా ఎదగడానికి అవసరమైన "సారం" ఏదో ఉంది.

ప్రతి దశాబ్దంలోనూ అటువంటి మహనీయులు అవతరించడం చూస్తూనే ఉన్నాం.

అది మన భారతీయ ధార్మిక జీవన విధానమే
ఆ "సారం".

అలా మహనీయుడు పుట్టని దశాబ్దం ఉన్నదంటే
ఈ భూమికి "చేవ" చచ్చినట్టు.

యుగాలపర్యంతం వస్తున్న ఆ చేవను
అలాగే మనం భవిష్యత్తరాలవారికి మనం అందివ్వాలంటే ఏకైక మార్గం - ధర్మాచరణం.

ధర్మాచరణ యొక్క దివ్యఫలమే భగవదనుగ్రహంగా,
అవతారమూర్తిగా ప్రకటనమౌతుంది ప్రపంచంలో.

ధర్మాచరణ అంటే శీలం.
శీలం అంటే పారదర్శకత(Transparency)

పారదర్శకత అంటే-
నీవు నీ లోపల ఏదో
బయట కూడా అదిగానే ఉండడం.

* * *